సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



జగన్ పాలనకు ఆకర్షితులై..
సీఎం జగన్ పాలనకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. 8లో



ఎలుకల నివారణకు సిద్ధం
సామూహిక ఎలుకల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేయనుంది. 8లో



మద్దిలో పవిత్రోత్సవాలు
జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం బోడపాడు మహిళా సంఘ సభ్యులకు డ్వాక్రా సొమ్ము అందజేతలో భాగంగా రూ.6 లక్షల చెక్కును అందజేశారు. మహిళలను ప్రత్యేకంగా అభినందించి పొదుపు సంఘాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు దాసరి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా సంఘ సభ్యులు మంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరించారు.

భారతీయ విద్యాభవన్స్‌కు అంతర్జాతీయ పురస్కారం



అంతర్జాతీయ హరితవన అవార్డు పత్రాన్ని చూపుతున్న శ్రీరంగనాథరాజు

సాక్షి, భీమవరం: యునెస్కో నిర్వహించిన అంతర్జాతీయ హరితవన పాఠశాల పోటీల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి భీమవరం భారతీయ విద్యాభవన్స్ స్కూల్ అంతర్జాతీయ హరితవన పాఠశాల అవార్డు దక్కించుకుందని భవన్స్ స్కూల్ అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఆదివారం స్కూల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జీ–20 సమ్మిట్‌లో భాగంగా ఈనెల 15న న్యూయార్క్ కార్నల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 7వ ఎస్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో న్యూయార్క్‌కు చెందిన అంతర్జాతీయ వ్యవహారాల అధికారి దిలీప్ చౌహాన్ చేతులమీదుగా పురస్కారం అందుకున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజును స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి, స్కూల్ సంచాలకుడు బి.శేషగిరిరావు, స్కూల్ కమిటీ సభ్యులు అభినందించారు.

చురుగ్గా ఆరోగ్య సురక్ష సర్వే

1.51 లక్షల కుటుంబాలకు పూర్తి



కొప్పర్రులో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని స్థానికంగా వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. ఈనెల 16 నుంచి ఇప్పటివరకు 1,51,851 కుటుంబాలకు సర్వే పూర్తి చేశారు. ఈనెల 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకూ ఆయా గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లాలో చేసిన సర్వేలో రక్తపోటు (బీపీ) పరీక్షలు 59,139, మధుమేహం పరీక్షలు 45,622, మూత్ర పరీక్షలు 526, రక్త పరీక్షలు 45,584, మలేరియా పరీక్షలు 211, డెంగీ పరీక్షలు 172, కఫం పరీక్షలు 627 చేశారు. పరీక్షలకు సంబంధించిన రోగుల డేటాను వైద్య శిబిరాల్లో డాక్టర్లకు అందజేస్తారు. దీనిద్వారా వైద్యులు సేవలందించి మందులు అందిస్తారు. అవసరమైన వారిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు.

నలుగురు సీఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఇద్దరు సీఐలకు పోస్టింగులు ఇవ్వగా, మరో ఇద్దరు సీఐలను వీఆర్‌కు పంపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ సీఐ ఎస్.లక్ష్మణరావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న సీఐ వి.పుల్లారావును రాజమహేంద్రవరం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న మధుబాబును ఏలూరు రేంజ్‌కు బదిలీ చేయగా, ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న సీఐ ఎస్‌పీ వీరయ్యగౌడ్‌కు రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు.



ద్వారకాతిరుమల: వేంపాడులో ఊరేగింపు



భీమడోలు: ట్రాక్టర్‌పై తరలిస్తూ..



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలో ఊరేగింపు



అత్తిలి : కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వినాయకా.. సెలవిక

వెళ్లిరావయ్య.. బొజ్జ గణపయ్యా.. అంటూ నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా గణపతి ఊరేగింపులుగా అట్టహాసంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, శక్తి వేషధారణలు, తీన్‌మార్ డప్పులతో వినాయక విగ్రహాలను ఊరేగించి గంగమ్మ ఒడికి చేర్చారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రగతికి రహదారి

216 జాతీయ రహదారి

- జిల్లాలో దాదాపు పూర్తయిన హైవే విస్తరణ
- తీర ప్రాంతం అనుసంధానంగా రాకపోకలు
- సీతారామపురం వద్ద టోల్‌గేట్ ట్రయల్‌రన్
- రవాణా చరిత్రలో మైలురాయి



నరసాపురం మీదుగా విస్తరించిన 216 జాతీయ రహదారి

నరసాపురం: జిల్లాలో తీర ప్రాంతానికి అనుసంధానంగా జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. నరసాపురం మీదుగా 216 జాతీయ రహదారి విస్తరణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. చిన్నపాటి పనులు పెండింగ్‌లో ఉన్నా వాహన రాకపోకలకు ఇబ్బంది లేదు. దీంతో ఏడాదిగా అనధికారికంగా వాహన రాకపోకలు సాగుతున్నాయి. అధికారికంగా రహదారి ప్రారంభానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో నరసాపురం మండలం సీతారామపురం వద్ద టోల్‌గేట్‌ను సిద్ధం చేశారు. ఈనెల 23న రాత్రి నుంచి టోల్‌గేట్ వద్ద ట్రయిల్‌రన్ నిర్వహిస్తున్నారు. నెలాఖరు నుంచి టోల్‌ప్లాజా వద్ద ఫీజులు వసూలు చేయనున్నారు. రహదారి పనులు 2013 నవంబర్‌లో పనులు ప్రారంభం కాగా దాదాపు పదేళ్ల పట్టింది. మొత్తంగా రూ.1,100 కోట్లు ఖర్చు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం ప్రాంతాన్ని ఆనుకుని 19 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. తీర ప్రాంతానికి అనుసంధానంగా జాతీయ రహదారి అందుబాటులోకి రావడం జిల్లా రవాణా చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలుస్తోంది.

87 కిలోమీటర్ల మేర విస్తరణ

నరసాపురం, మొగల్తూరు మీదుగా ఒంగోలులో జాతీయ రహదారిని కలుపుతూ మార్గం ఏర్పడింది. మొగల్తూరు–భీమవరం మండలాల మధ్యన నాగిడిపాలెం వంతెన, భీమవరం–లోసరి మధ్యన లోసరి వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ నుంచి కృష్ణా జిల్లా లోసరి గూట్లపాడు వరకు మధ్య ఉన్న 87 కిలోమీటర్లు జాతీయ రహదారి విస్తరణ పనులు నెమ్మదిగా సాగాయి. దీంతో నరసాపురం మీదుగా ఒంగోలుకు రవాణా మార్గం ఉన్నా విస్తరణ పనులు నత్తనడకన సాగడంతో రోడ్డు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో చించినాడ నుంచి లోసరి వరకు హైవేను విస్తరించాలనే డిమాండ్ పెరిగింది. అయితే భూసేకరణలో జాప్యం జరిగింది. అలాగే గత టీడీపీ పాలకులు రోడ్డు పురోగతిపై దృష్టి పెట్టలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే..

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 216 హైవే విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పెద్దలతో రాష్ట్ర ఎంపీలను మాట్లాడించడంతో పనుల్లో పురోగతి కనిపించింది. కేంద్ర ప్రభుత్వం పెండింగ్ నిధులు విడుదల చేయడంతో పనులు పుంజుకున్నాయి.



నరసాపురం మండలం సీతారామపురం వద్ద టోల్‌ప్లాజా

డబుల్ లైన్‌తో సౌలభ్యం

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సింగిల్‌లైన్‌గా ఉన్న రోడ్డును 13 మీటర్లు మేర విస్తరించి డబుల్ లైన్ చేశారు. దీని నిర్మాణంతో నరసాపురం మీదుగా మచిలీపట్నం, ఒంగోలు, విజయవాడ వెళ్లడానికి దూరం తగ్గింది. అలాగే వ్యాపార, విద్య, వైద్య సదుపాయాల కోసం విజయవాడకు అక్కడి నుంచి ఇతర నగరాలకు వెళ్లడానికి ఉపయోగకరంగా ఉంది. రహదారి అధికారికంగా ప్రారంభం కాకపోయినా వాహన రాకపోకలు పెరిగాయి. గోదావరి జిల్లాల్లో సగం ప్రాంతాల నుంచి ప్రజలు మచిలీపట్నం, విజయవాడ, ఒంగోలు వైపు వెళ్లడానికి ఇటుగా ప్రయాణిస్తున్నారు. అలాగే డెల్టా, తీర ప్రాంతం నుంచి కొబ్బరి, మత్స్య ఎగుమతులకు అనువైన రవాణా సౌకర్యం ఏర్పడింది.

కేంద్రంతో తరచూ సంప్రదిస్తూ..



216 హైవే పనులు దాదాపు పూర్తవడం శుభపరిణామం. రోడ్డు విస్తరణతో పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల వారికి ఎంతో ఉపయోగం ఉంది. నత్తనడకన సాగుతున్న పనులు పూర్తి చేయించడానికి తరచూ జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో సంప్రదించాం. వైఎస్సార్‌సీపీ ఎంపీల దృష్టికి తీసుకెళ్లి కేంద్రంతో మాట్లాడించాం. ఈ రోడ్డు నరసాపురం తీర ప్రాంత అభివృద్ధిలో మైలురాయి.

–ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

తీర ప్రాంత అనుసంధానంగా..



నరసాపురం ఏరియాలోని తీర ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ జాతీయ రహదారి అందుబాటులోకి రావడం అభినందనీయం. హైవే విస్తరణ పనులు త్వరితగతిన పూర్తికావడానికి కృషి చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రయత్నాన్ని అభినందించాలి. ఇప్పుడు విజయవాడ, ఒంగోలు వైపు వెళ్లడానికి నరసాపురం మీదుగా దగ్గరైన జాతీయ రహదారి అందుబాటులోకి రావడం ఈ ప్రాంత అభివృద్ధికి కీలకం.

– చాగంటి సత్యనారాయణ, ఆక్వాట్రేడ్ వ్యాపారి

ముగిసిన శిక్షణ



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు ఇస్తున్న డీపీఓ విశ్వనాథ్

ఏలూరు(మెట్రో): పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఏలూరులో ఆదివారం కార్యదర్శుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల అమలులో మానవీయ కోణం ఉండాలన్నారు. నెల రోజుల నుంచి జిల్లాలోని 858 మంది కార్యదర్శులకు ఐదు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పంచాయతీ పరిపాలన, సంక్షేమ కార్యక్రమాల అమలు, అక్రమ నిర్మాణాలు, సర్వీసు నిబంధనలు, విద్యా, వైద్యం, పంచాయతీ రికార్డుల నిర్వహణ, గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ, సమాచార హక్కు, ఉపాధి హామీ అమలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఏలూరు జిల్లా నుంచి 484 మంది, పశ్చిమగోదావరి జిల్లా నుంచి 374 మంది కార్యదర్శులు హాజరయ్యారన్నారు. శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం రూ.30 లక్షల విడుదల చేసిందని, ఒక్కో కార్యదర్శికి రూ.6,500 చొప్పున ఖర్చు చేశామన్నారు. నాలుగు కేంద్రాల్లో శిక్షణ నిర్వహించామన్నారు. శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి పంచాయతీ రాజ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జె.మురళి, ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, కోర్సు పరిశీలకుడు దోసిరెడ్డి, జెడ్పీ సీఈఓ రవికుమార్ సహకారం అందించారని డీపీఓ విశ్వనాథ్ అన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందించారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో ‘భవన్స్’కు సంబంధం లేదు



భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరంగనాథరాజు

భారతీయ విద్యాభవన్స్ ఛైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

సాక్షి, భీమవరం: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో వెస్ట్ గోదావరి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అండ్ కల్చరల్ సొసైటీ, భారతీయ విద్యాభవన్స్‌కు ఎటువంటి సంబంధం లేదని విద్యాభవన్స్ అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. ఆదివారం భారతీయ విద్యాభవన్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1981లో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లోని కొంతమంది సభ్యులు, దాతల సహకారంతో రూ.83 లక్షలు సమకూర్చి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అండ్ కల్చరల్ సొసైటీని ఏర్పాటుచేసి భీమవరం, తాడేపల్లిగూడెంలో భారతీయ విద్యాభవన్స్ స్కూళ్లు నెలకొల్పామన్నారు. విద్యాభవన్స్‌కు ముందుగా ధర్మారావు ఛైర్మన్‌గా తాను వైస్ ఛైర్మన్‌గా పనిచేయగా తర్వాత తాను ఛైర్మన్ పదవి చేపట్టానన్నారు. తాను 1998లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉండటంతో రెండు పదవులు నిర్వహించానని అయితే ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తర్వాత రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో కేవలం విద్యాభవన్స్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు చెప్పారు. అయితే కొంతమంది అవగాహన లేకుండా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడే స్కూల్ అధ్యక్షుడిగా ఉంటారని చెబుతున్నారని.. బైలాలో ఎక్కడా ఇటువంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేశారు. ముందుగా ఏర్పడిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అండ్ కల్చరల్ సొసైటీ సభ్యులు 250 మంది కుటుంబసభ్యులు మాత్రమే నేటికీ కొనసాగుతున్నారని, కొత్తగా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లోకి వచ్చిన సభ్యులకు కల్చరల్ సొసైటీకి ఏమాత్రం సంబంధం లేదన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెంతోపాటు పాలకొల్లులో కూడా విద్యాభవన్స్ స్కూల్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తాడేపల్లిగూడెంలో 30 ఎకరాలు, భీమరంలో 17 ఎకరాలు సేకరించి అప్పట్లో స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం స్కూళ్లను కేంద్ర కమిటీతోపాటు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా తనపై ఏనాడు అవినీతి ఆరోపణలు లేవని, తానెప్పుడూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నానని శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండుగ చేసిన జగన్ ప్రభుత్వం

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ వెల్లడి



ఉండి ఏఎంసీ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న ఎంపీ బోస్. చిత్రంలో మంత్రి కారుమూరి, చీఫ్ విప్ ముదునూరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్సీ కవురు

ఆకివీడు: గత ప్రభుత్వాలు వ్యవసాయాన్ని దండగ అంటే.. నాలుగునర్నేళ్ల సీఎం జగన్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసిందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించారు. సభకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, బడ్జెట్, రైతు భరోసా పథకం, వడ్డీ లేని రుణం, ఉచిత పంట బీమా వంటివి దేశంలో ఎక్కడా లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.30 లక్షల కోట్లను వ్యవసాయ రంగానికి వెచ్చించిందన్నారు. పదెకరాలలోపు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటే అన్నారు.

కేంద్రం స్వామినాథన్ సిఫార్సులు అమలు జరిగితే రైతులకు మరింత లాభం కలుగుతుందన్నారు. రైతుల భూములకు రక్షణ కల్పించేలా సీఎం జగన్ మరో చట్టం తీసుకురానున్నారన్నారు. మన భూమిని మనకు తెలియకుండా ఎవరైనా విక్రయిస్తే ఆ భూమి ధరను ప్రభుత్వమే మనకు చెల్లించే విధానాన్ని అమలుజేసే చట్టం తీసుకువస్తున్నారని, ఇది సింగపూర్‌లో తప్ప ఎక్కడా లేదని, కేంద్రం ఆమోదం పొందిన వెంటనే అమలు చేస్తారని అన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీసుకువచ్చేందుకు ఏఎంసీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన, లాభదాయక పంటల సాగును ప్రోత్సహించాలని కోరారు.

చంద్రబాబుది స్కామ్‌ల ప్రభుత్వం

రాష్ట్రంలో సీఎం జగన్‌ది సంక్షేమ పథకాలు (స్కీములు) ప్రభుత్వం కాగా గత చంద్రబాబు పాలన అవినీతి అనకొండల (స్కామ్‌ల) ప్రభుత్వమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చంద్రబాబు అవినీతి కుంభకోణాలకు అంతం లేకుండా పోయిందన్నారు. రెండెకరాల భూస్వామిగా ఉన్న చంద్రబాబు వేల కోట్లకు యజమాని ఎలా అయ్యారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ తలుపు తట్టి పథకాల్ని ఇంటికే చేరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీమళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.



ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

బీసీలకు పెద్దపీట

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. అనంతరం ఏఎంసీ చైర్మన్‌గా బొక్కా వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా చేకూరి రాజా నరేంద్రకుమార్, ఇతర డైరెక్టర్లతో పీవీఎల్ ప్రమాణం చేయించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్‌సన్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి జి.గోపి, ఆకివీడు ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, గూడూరి ఉమాబాల, ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, వ్యవసాయ సలహా కమిటీ మండల చైర్మన్ నంద్యాల సీతారామయ్య, సర్పంచ్ కమతం సౌజన్య, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్థల కనకదుర్గ పాల్గొన్నారు.

సచివాలయాల ప్రారంభం

ఉండి మండలంలోని మహాదేవపట్నంలో సచివాలయం–1,2, రెండు ఆర్బీకేలను రాజ్యసభ సభ్యుడు బోస్, మంత్రి కారుమూరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ ప్రారంభించారు.

క్లుప్తంగా

యనమదుర్రు డ్రెయిన్‌లో దూకి యువతి ఆత్మహత్య

సాక్షి, భీమవరం: గణపవరం మండలం సరిపల్లికి చెందిన మందలంక మెర్సి(19) భీమవరం పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్‌లో దూకి ఆత్మహత్య చేసుకుందని టూటౌన్ సీఐ జి శ్రీనివాస్ ఆదివారం చెప్పారు. మెర్సీ కొంతకాలంగా పట్టణంలోని ఉండి రోడ్డులోని ఒక రెస్టారెంట్‌లో పని చేస్తోంది. ఈ నెల 23న యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకింది. అనంతరం గాలించగా మృతదేహం దొరకడంతో పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. మృతురాలి నాన్నమ్మ సౌధామణి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఎం.మోహనరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మద్దిలో రెండో రోజు ఘనంగా పవిత్రోత్సవాలు



మద్దిలో పవిత్రోత్సవాల నిర్వహణ

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామికి పుణ్యాహవచనం, వాస్తు పూజ, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు హోమం, సూత్ర గ్రహణం, ప్రోక్షణ, గ్రంధి బంధనం, చతుర్వేదధ్యయనం, ద్వాదశ సూక్త పారాయణం, ఏతత్ ప్రధాన హోమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు పవిత్రాలను స్వామికి అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనకు ఆకర్షితులై..

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు



తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఇరగవరం మండలం బొబ్బరాసుపాలెంకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదిరాజు పెద్దిరాజు (బుజ్జి రాజు) ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన వారికి మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు జగనన్న అందిస్తున్న సంక్షేమం వల్లే వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారని అన్నారు. కులం, మతం, పార్టీ అనే భేదాల్లేకుండా జగనన్న ప్రజలందరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారని, టీడీపీ పాలనలో వారి వర్గానికి మాత్రమే మంచి చేసేవారని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన పార్టీ ఏం చేస్తుందో చెప్పడం మానేసి ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. పార్టీలోకి చేరిన వారంతా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి పనిచేసిన వారందరికీ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నడింపల్లి శ్రీరామరాజు, పులుపు అనీల్‌కుమార్, మైనం పాము, చేబ్రోలు పెద్దిరాజు పాల్గొన్నారు.

అండర్–13 చెస్ పోటీలకు ఎంపిక



చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో భీమవరంలో ఆదివారం జిల్లా స్థాయి అండర్–13 ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు అక్టోబర్ 19 నుంచి 22 వరకు విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్–13 చెస్ పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో ఆముదాలపల్లి కార్తీక్, సాధనాల అంజలిప్రియ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ ఇ.హరికృష్ణ బహుముతుల అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, చెస్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి మైలపురి మురళి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పాముకాటు గుర్తై వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తాడేరు గ్రామానికి చెందిన పెంటపాటి పరుశురాముడు(60) మధ్యాహ్నం పొలంలో పాము కాటుకు గురయ్యాడు. ఇంటికి వచ్చి పాముకరిచిందని చెప్పగా భీమవరంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



బ్రిడ్జిపై నుంచి పడి మృతి చెందిన వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ సమీపంలో కృష్ణ కాలువలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామానికి చెందిన ఘంటసాల వెంకట గోవర్ధన్(35) భార్య జయలక్ష్మికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గోవర్ధన్ 5 ఎకరాల్లో చేపల చెరువులు సాగుచేస్తున్నాడు. అప్పులు ఉన్నాయని చెబుతున్నారు. అతని భార్యతో గొడవలు ఉండడంతో ఆమె ఈనెల 22న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఏలూరులో ఒక హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. ప్రతీ రోజూ గోవర్ధన్ ఏలూరు హాస్పిటల్‌కు వచ్చి వెళుతున్నాడు. మద్యం అతిగా తాగి ఇంటికి వెళుతున్నాడు. ఆదివారం ఉదయం పాతబస్టాండ్ సమీపంలో కృష్ణ కాలువలో మృతిచెంది ఉన్నాడు. తలకు బలమైన గాయమైంది. అధికంగా మద్యం సేవించి మత్తులో బ్రిడ్జిపై నుంచి తూలి కాలువలో పడిపోయాడా? లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక ఎలుకల నివారణకు సిద్ధం

- నేడు రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- 1,107 కిలోల మందు పంపిణీ



భీమవరం ప్రాంతంలో సార్వా వరి

సాక్షి, భీమవరం: రైతన్నలకు ప్రతి ఏటా ఎలుకల బెడద తప్పడం లేదు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వరిపైరును పెంచి పెద్దచేసిన తరువాత చిరుపొట్టదశలో ఎలుకలు విజృంభించి పంటకు నష్టం కలుగజేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల నివారణకు గతంలో చేల చుట్టు విద్యుత్ తీగలను అమర్చి ఎలుకల బెడదను తగ్గించుకోడానికి రైతులు ప్రయత్నాలు చేశారు. వరి పొలం చుట్టూ విద్యుత్ తీగలు పెట్టడం వల్ల అనేక ప్రమాదాలు జరగడమే కాక కొన్ని సందర్భాల్లో విద్యుత్ షాక్‌తో రైతులు, పశువులు మరణించిన సందర్భాలున్నాయి. ఇటీవల విద్యుత్ ఏర్పాటును రైతులు విరమించుకున్నారు. దీంతో చేలలో ఎలుకల బోనులు పెట్టడం, గట్ల వద్ద కన్నాల్లోని ఎలుకలను పట్టించడం వంటివి చేపట్టడంతో ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది.

జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో వరిసాగు

జిల్లాలోని 20 మండలాల పరిధిలో దాదాపు 2.13 లక్షల ఎకరాల్లో ప్రస్తుత సార్వా సీజన్‌లో నాట్లు వేశారు. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఇగరవరం, పాలకొల్లు, పెనుమంత్ర తదితర మండలాల్లోని వరి పైరు అనేక చోట్ల పొట్టదశకు చేరుకుంది. దీంతో ఎలుకల బెడద ఎక్కువైనట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల నివారణకు రైతు భరోసా కేంద్రాల స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎలుకల్లో సంతానోత్పత్తి ఎక్కువ

ఎలుకల జీవిత కాలం కేవలం రెండేళ్లు మాత్రమే. ఆడ ఎలుక పుట్టిన 5 వారాలకే పిల్లలను ఉత్పత్తిచేసే శక్తి కలిగి ఉంటుంది. ఆడ, మగ ఎలుకలు కలిసిన ప్పటి నుంచి ఏడాదిలో 1,200 వరకు పిల్లలు జన్మనిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎలుక పళ్లు రోజుకు 0.3 మిల్లీమీటర్ల పొడవున పెరగడం వల్ల వాటిని అరగదీయం కోసం ప్రతి రోజు ఎక్కువ సమయం ఏదో ఒకదానిని కొరుకుతూనే ఉంటాయి. దీనిలో భాగంగానే వరి పైరును ఎక్కువగా కొరకడం వల్ల పంటకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది.

బ్రోమోడయోలిన్ మందు పంపిణీకి సిద్ధం

జిల్లాలో ఎలుకల బెడద నివారణకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏటా ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేస్తుంది. దీనిలో భాగంగా రైతులకు పంపిణీ చేసేందుకు 1,107 కిలోల బ్రోమోడయోలిన్ మందును సిద్ధం చేశారు. వరి సాగు చేసిన భూములతో పాటు హార్టికల్చర్ సాగు భూములు, ఖాళీ ప్రదేశాల్లో రైతులంతా సామూహికంగా ఒకేసారి ఎలుకల నివారణ మందు పెట్టేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది. జిల్లాలోని 379 గ్రామాల్లో సుమారు 1.30 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ నెల 25న ముందుగా రైతులంతా చేలగట్లు, ఇతర ప్రాంతాల్లోని ఎలుకల బొరియలను గుర్తిస్తారు. తరువాత రోజు బొరియల్లో బ్రోమోడయోలిన్ మందులో నూకలు, నూనె కలిపిన మిశ్రమాన్ని కట్టి ఎలుకల బొరియల్లో వేస్తారు. రైతులంతా సామూహికంగా చేపట్టడం వల్ల ఎలుకలను నివారించే అవకాశముంటుంది.

1,100 కిలోల బ్రోమోడయోలిన్ సిద్ధం



జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలనకు సుమారు 1,100 కిలోల బ్రోమోడయోలిన్ మందును సిద్ధం చేశారు. ఈ నెల 25న అన్ని గ్రామాల్లో రైతులకు మందు ఉచితంగా పంపిణీ చేస్తాం. 5 శాతం మందులో రైతులు 90 శాతం నూకలు, 5 శాతం నూనె కలిపి మందును పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో వేయాలి. ప్రభుత్వం ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నందున రైతులంతా సామూహికంగా నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చు. – జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

● గడపగడపకు సంక్షేమం



నరసాపురం: పట్టణంలోని 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నూజివీడు: మండలంలోని అన్నవరంలో విద్యుత్‌షాక్‌తో ఆదివారం వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైలవరానికి చెందిన కూరాటి బాలాజీ(37) నూజివీడులో ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. అతనికి మండలంలోని అన్నవరం సమీపంలో జగనన్న కాలనీలో నివేశన స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. నిర్మాణంలో ఉన్న ఇంటికి సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వాటరింగ్ చేసి స్విచాఫ్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చుట్టుపక్కల ఉన్నవారు హుటాహుటిన పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుసంచార్ డ్రైవర్ పోస్టులకు 26న ఇంటర్వ్యూలు

పెంటపాడు: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల డ్రైవర్ పోస్టులకు ఈ నెల 26న పెంటపాడులో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల జిల్లా మేనేజర్ శివతేజ ఒక ప్రకటనలో కోరారు. ఈఎంఆర్ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ పరిధిలో డ్రైవర్ పోస్టులకు ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 35 సంవత్సరాల లోపు వయసు, పదోతరగతి పాస్‌తో పాటు, హెవీ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్‌లో 2 నుంచి మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు పెంటపాడు పశుసంవర్ధక శాఖ కార్యాలయం, ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న వెటర్నరీ ఆసుపత్రి వద్ద సంప్రదించాలన్నారు. భీమవరం, తణుకు, పెరవలి, నరసాపురం, పాలకొల్లు, ఉండి, కాళ్ల, అత్తిలి, పట్టింపాలెం, మొగల్తూరు, యలమంచిలి, మార్టేరు, ఆచంట ప్రాంతాలలో ఖాళీలు ఉన్నాయని మేనేజర్ శివతేజ తెలిపారు. పూర్తి వివరాలకు 91105 95889 నెంబరులో సంప్రదించాలన్నారు.

భారంగా మారిన సినిమా బడ్జెట్



భీమవరంలో మాట్లాడుతున్న నిర్మాత నర్సింహారావు

సాక్షి, భీమవరం: నేటి ట్రెండ్‌కు తగ్గట్టు సినిమాలు నిర్మిస్తేనే తప్ప.. పాత తరం వాళ్లు ఇప్పుడు సినిమా చేయాలంటే కష్టమేనని సినీ నిర్మాత, రాశీ మూవీస్ అధినేత మార్లెళ్ల నర్సింహారావు అన్నారు. భీమవరంలో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ.. తన తరం నిర్మాతలకు ప్రస్తుతం సినిమాలు చేద్దామన్నా అవకాశాలు రావడం లేదన్నారు. తాను సుమారు 60 చిత్రాలు వరకు నిర్మించినట్లు చెప్పారు. శోభన్ బాబు హీరోగా నిర్మించిన బావ మరదళ్లు మంచి విజయాన్ని అందుకుందని అబ్బాయిగారు, మహారాజు, మంగళ గౌరీ, పెళ్లైంది, భార్యాభర్తలు వంటి చిత్రాలు నిర్మించినట్లు తెలిపారు. శోభన్‌బాబు హీరోగా 6 చిత్రాలు, కృష్ణతో గూఢచారి 117 నిర్మించినట్లు చెప్పారు.

నూజివీడుతో ఎస్పీ బాలుకు ఎనలేని అనుబంధం



ఎస్పీ శైలజ, శుభలేక సుధాకర్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్వీఎల్ సాహితీ సమాఖ్య ప్రతినిధులు

నూజివీడు: ఎమ్వీఎల్‌తో స్నేహం కారణంగానే ఎస్పీ బాలుకి నూజివీడు ప్రాంతంతో ఎనలేని అనుబంధం ఏర్పడిందని ప్రముఖ గాయని ఎస్పీ శైలజ అన్నారు. బాలు–ఎమ్వీఎల్‌ల స్నేహానికి ప్రతి రూపంగా ఎమ్వీఎల్ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో శనివారం రాత్రి సెప్టెంబరు స్నేహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ శైలజ సెప్టెంబర్ స్నేహోత్సవం లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, మద్దాలి వెంకట లక్ష్మీ నరసింహారావు(ఎమ్వీఎల్)ల స్నేహం నేటి తరానికి స్ఫూర్తిలాంటిదన్నారు. ఒక్కసారి స్నేహం కుదిరితే ప్రాణం పోయే వరకు ఆ స్నేహాన్ని వదలకూడదని ఎస్పీ బాలు అంటుండేవారని ప్రముఖ సాహితీ పరిశోధకులు పైడిపాల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఎంతో ప్రోత్సహించేవారన్నారు. ఎమ్వీఎల్ కుమారుడు రామప్రసాద్ జ్ఞాపకార్థం అధిక ప్రసంగం, ఎమ్వీఎల్ కవితలు అనే పుస్తకాలను ఎస్పీ శైలజ, ముళ్లపూడి శ్రీదేవి ఆవిష్కరించారు. అనంతరం ముళ్లపూడి శ్రీదేవికి సాహితీ సత్కారం, ఎస్పీ శైలజకు సంగీత సత్కారం చేశారు. అనంతరం ఎస్పీ శైలజ పాట పాడి వీక్షకులను ఆనందింపచేశారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నృత్య రూపకం ఆకట్టుకుంది. అనంతరం సాలూరు వాసూరావు, పైడిపాల సత్యనారాయణరెడ్డి, శుభలేక సుధాకర్, ముళ్లపూడి వరలను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్వీఎల్ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు మోటూరి బలరామకృష్ణమూర్తి, కార్యదర్శి ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, రామసూరి, అత్తిలి వెంకటరమణ, అక్కినేని సత్యశ్రీధర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పేర్ని నాని



మాజీ మంత్రి పేర్ని నాని దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్యక్షేత్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని ఆదివారం సాయత్రం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులతో పాటు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాలు పలుకగా దేవస్థానం ఏఈవో ఆర్.లక్ష్మణస్వామి శ్రీవారి మెమొంటోను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శ్యాముల్, పార్టీ యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, స్థానిక సొసైటీ చైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బాలం వెంకటేశ్వరరావు, షేక్ బాషా, ఉక్కుర్తి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

బాలసదనంపై ఆరోపణలు అవాస్తవం



సూపరింటెండెంట్ బేబి సరోజిని

దెందులూరు: దెందులూరులో ప్రభుత్వ బాలసదనంపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమణి, బాలసదనం సూపరింటెండెంట్ బేబి సరోజిని అన్నారు. ఆదివారం దెందులూరు బాలసదనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బాలసదనంలో ఉన్న ఇద్దరు అక్కాచెల్లెళ్ళు గోడదూకి పారిపోయారన్నారు. బట్టలు ఉతకడానికి వాషింగ్ మెషీన్ ఉందని.. పనులు చేయడానికి ఆయమ్మ ఉందని చెప్పారు. సీసీపుటేజ్ సైతం చూడవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ సైతం జిల్లా అధికారులతో విచారణ నిర్వహించారన్నారు. బాలికలు పారిపోయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

రూ.9 లక్షల విలువైన మద్యం సీజ్



గోవా తయారీ మద్యం, నిందితులను మీడియాకు చూపుతున్న అధికారులు

సింగరాయకొండ (ప్రకాశం జిల్లా): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో శనివారం రాత్రి సుమారు రూ.9 లక్షల విలువైన 1,087 బాటిళ్ల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, సెబ్ డీఎస్పీ ఎం.సుధీర్‌బాబు తెలిపారు. కె.బిట్రగుంట కేంద్రంగా మాధవి అనే మహిళ అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. శనివారం గోవా నుంచి కారులో తెస్తున్న 12 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఆమె ఇంటిని, పరిసరాలను తనిఖీ చేయగా మరో 22 కేసుల మద్యం దొరికిందని చెప్పారు. మాధవితో పాటు ఆమెకు సహకరిస్తున్న ఉమామహేష్‌నాయుడు, రవితోపాటు తణుకుకు చెందిన పాపినాయుడు, బాలాజీని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం రవాణా చేస్తున్న కారు, స్కూటీ, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మాధవిపై స్థానిక స్టేషన్‌లో, ఉమామహేష్ నాయుడిపై నిడదవోలు స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. గోవాకు చెందిన ఆనంద్ వైన్స్ యజమాని తణుకులోని పాపినాయుడుకు మద్యం సరఫరా చేస్తున్నాడని నిర్ధారణ అయిందన్నారు. వీరిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వారాల పండుగలో విషాదం



మృతి చెందిన పోతురాజు(40)

భీమడోలు: గుండుగొలనులోని డోకల వారి వీధిలో ఆదివారం సాయంత్రం వారాల పండుగలో విషాదం చోటు చేసుకుంది. వారాల పండుగ సందర్భంగా గ్రామంలో గంగానమ్మ ప్రభ ఊరేగిస్తున్నారు. ఈ క్రమంలో శక్తి వేషం వేసి నృత్య విన్యాసాలు చేస్తున్న ఓ కళాకారుడు గుండెపోటుతో కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. దీంతో తీవ్ర విషాదం నెలకొంది. ఏలూరు మండలం పోణంగికి చెందిన వేమూరి పోతురాజు(40) నృత్య విన్యాసాలు చేస్తూ అలరిస్తున్నాడు. నృత్యం చేస్తుండగానే గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కళాకారులంతా అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఊరూరా ఆధ్యాత్మిక శోభ


తణుకు అలంపురంలో ఏర్పాటు చేసిన గణేషుని మందిరం


అత్తిలి మండలం కె.సముద్రపుగట్టులో గణపతి ప్రతిమను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు


సామూహిక సరస్వతీ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

- ఏడో రోజు కొనసాగిన గణపతి నవరాత్రి ఉత్సవాలు
- పలు గ్రామాల్లో కోలాహలంగా ప్రతిమల నిమజ్జనాలు

పెంటపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వాడవాడలా ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల పందిళ్ల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఏడో రోజును పురస్కరించుకుని పలు గ్రామాల్లో గణపతి విగ్రహాల భారీ ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా, నృత్యాలు, డప్పుల ఊరేగింపుతో వినాయకుని ప్రతిమలను పలు గ్రామాలలో నిమజ్జనం చేశారు. కొబ్బరితోట యూత్, బండారు అప్పలస్వామి వీధి ప్రాంతాలలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. యూత్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న గణేషుని మందిరం


పెంటపాడు కొబ్బరితోటలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

వినాయక చవితిని పురస్కరించుకుని అలంపురం టీబీఆర్ సంస్థల ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన ప్రత్యేక హంగులతో ఏర్పాటు చేసిన వినాయకుని మందిరం పలువురిని ఆకట్టుకుంటోంది. సంస్థల చైర్మన్ తనబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మందిరం వద్ద చవితి రోజు నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ఇక్కడ వినాయకునికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు భోగేశ్వరరావు తెలిపారు.

గణపతి ప్రతిమల నిమజ్జనోత్సవం

అత్తిలి: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో వినాయక ప్రతిమల ఊరేగింపు, నిమజ్జనోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి ప్రతిమలను మేళ తాళాలతో ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్తిలి కాలువ రేవుల్లో గణపతి నిమజ్జనం చేసేవారితో సందడి నెలకొంది.

సామూహిక సరస్వతీ పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. సుమారు 300 మంది చిన్నారులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పావులూరి విశ్వనాథశాస్త్రి, రమేష్ బ్రహ్మత్వంలో సరస్వతీ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తణుకు రూరల్‌లో..

తణుకు టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామం అన్నపూర్ణ నగర్‌లోని శ్రీ రమణ మహర్షి ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి మండపంలోని గణపతిని వివిధ రకాల వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కుటుంబం సమేతంగా పాల్గొని నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని గణపతి మండపాల ఆధ్వర్యంలో గణేష నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.


పెంటపాడులో ముగ్గుల పోటీలు

క్లుప్తంగా

గణనాథుడిని దర్శించుకున్న మంత్రి కారుమూరి


తణుకులో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో చిన్నారులతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు 19వ వార్డు వేల్పూరు రోడ్డులోని పప్పుల వారి వీధిలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు కొమ్మోజు రామకృష్ణ, ఉప్పరాపల్లి బాలు, నక్కా వీర్రాజు, క్రొవ్విడి నాగాచారి, కర్ణ, కె.సత్యనారాయణ, మానేపల్లి శివకృష్ణ, పెద్దగాడి శ్యామశివప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు అంకురార్పణ


రాట మహోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి శరన్నవరాత్రి (దసరా) మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద ఆదివారం పందిరి రాట పాతడం ద్వారా అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వరుడు పూజ, విఘ్నేశ్వరుడు బియ్యం కట్టారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు జరిగాయి. దేవస్థానం చైర్మన్ కొట్టు అంజిబాబు, సీజీఎఫ్ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

నాట్య కళాకారిణి అంబికకు రంగస్థలరత్న పురస్కారం


అక్కినేని రంగస్థలరత్న పురస్కారం అందుకుంటున్న అంబిక

తణుకు: నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను పురస్కరించుకుని అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యాన తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి అంబిక రంగస్థలరత్న పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబికకు పురస్కారం ప్రదానం చేశారు. తెనాలికి చెందిన ప్రముఖ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అంబికను పలువురు అభినందించారు.

కాఫీ క్లబ్ సేవలు అభినందనీయం

సాక్షి, భీమవరం: మిత్రులందరితో క్లబ్ ఏర్పాటు చేసుకోవడంతోపాటు ఒక పుస్తకాన్ని ఆవిష్కరించడం గొప్ప విశేషమని ప్రముఖ సినీ నిర్మాత, రాశీ మూవీస్ అధినేత ఎం.నర్సింహారావు అన్నారు. భీమవరంలో ఆదివారం మార్నింగ్ కాఫీ క్లబ్ డైరెక్టరీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్లబ్‌లు ఐకమత్యంతోనే ఉండాలని, మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. క్లబ్ ఫౌండర్ అండ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో- ఎడిటర్ కనగర్ల విజయ రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడారు.

వచ్చే ఎన్నికల్లోనే మహిళా బిల్లును అమలు చేయాలి


మాట్లాడుతున్న కోనాల భీమారావు

తణుకు: వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును హడావుడిగా ఆమోదించడం బీజేపీ అవకాశవాద రాజకీయాలకు దర్పణం పడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆదివారం స్థానిక సురాజ్య భవన్‌లో మహిళా సమాఖ్య తణుకు పట్టణ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మహిళా సాధికారతపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా మహాసభ వచ్చేనెల 9న ఉండిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సమాఖ్య తణుకు పట్టణ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ప్రెసిడెంట్ కె.బాలకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్స్ సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం యూనిట్ ప్రెసిడెంట్ కె.బాలకృష్ణ కోరారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెన్షనర్ల ఆరోగ్య పరిస్థితులు గమనించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్రేరియర్స్, పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రతి నెల 1న పెన్షన్ చెల్లించాలని, ఈహెచ్‌ఎస్‌లో వర్తింపు చేస్తున్న సీలింగ్ మొత్తాన్ని రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని, మాస్టర్ హెల్త్ చెకప్ అమలుపై చర్యలు తీసుకోవాలని కోరుతు పలు తీర్మానాలను అమోదించారు. సలహాదారు వీకే వీరారావు, కార్యదర్శి వైవీ సత్యనారాయణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, ఎం.అర్జునరావు, బి.సూర్యనారాయణరాజు, కె.వెంకటేశ్వరరావు, జానకి రామయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తా


గొల్లలకోడేరులో కేక్ కట్ చేస్తున్న గ్రామస్తులు

పాలకోడేరు: రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్ రాజా నరేంద్రకుమార్ అన్నారు. ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామానికి వచ్చిన సందర్భంగా గొల్లలకోడేరులో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయనకు ఘనస్వాగతం పలికి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ తనను నమ్మి ఇచ్చిన బాధ్యతలను అప్పగించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తన రాజకీయ జీవితంలో గ్రామస్తులు అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధికి, గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలోని క్రిస్టియన్ ఏరియాల ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి నరేంద్రకుమార్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువలతో ఆయనను క్రిస్టియన్ పేట పెద్దలు, యూత్, మహిళలు సత్కరించారు. మెయిన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కేక్‌ను నరేంద్రకుమార్ కట్ చేసి అందరికీ పంచారు. జీవీ నరసింహరావు, బాబూరావు, సాలోమోను, నేతల సాల్మన్, చంద్రశేఖర్, రాజశేఖర్, సత్యనారాయణ, గాంధీ, పవన్, దీపు, నరేష్, రవి, వెంకటరాజు, బన్ను పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో సేవాభావం పెంపు

తణుకు టౌన్: విద్యార్థుల్లో సేవాభావం పెంపునకు జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) దోహదపడుతుందని తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. ఆదివారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా తమ కళాశాల విద్యార్థినులు గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యసేవలను గ్రామీణ ప్రాంత పేదలకు అందించినట్లు చెప్పారు. జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు జి.రమ్య, సీహెచ్ రమేషబాబు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ తీరు సరికాదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లోకసభ సమావేశంలో బహుజన సమాజ్ పార్టీ ఎంపీ దనిష్ అలీని అగౌరవపరిచేలా బీజేపీ ఎంపీ రమేష్ బిదూరి మాట్లాడటం సరికాదని పట్టణ వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ నౌషాద్ మొహిద్దీన్ ఖండించారు. పట్టణంలో ఆదివారం నౌషాద్ మొహిద్దీన్ మాట్లాడుతూ దనిష్ అలీని ఉగ్రవాది, తీవ్రవాది అంటూ అనేక అనరాని మాటలతో అవమానపరిచి పార్లమెంట్ చరిత్రలో ఎవరు కూడా వాడని భాషను బిదూరి వాడటం శోచనీయం అన్నారు. ఇతర మతాలను కించపరిచేలా చూడటం సరికాదని, మతాన్ని విడగొట్టి విమర్శించడం గతంలో ఎప్పుడు జరగలేదని తెలిపారు. బీజేపీ ఎంపీ రమేష్ బిందూరిని వెంటనే చట్టసభలలో, ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హత వేటు వేయాలని కోరారు. బిందూరిని అరెస్టు చేసి శిక్షించాలని, భారత రాజ్యాంగ గౌరవ మర్యాదలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వినియోగదారుల సమావేశం

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారుల సమస్యలపై సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వినియోగదారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల వీరాస్వామి నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ, పౌర సరఫరాల శాఖ ఆదేశానుసారం సోమవారం ఉదయం 11 గంటలకు పట్టణంలో వీరావారి వీధిలో వినియోగదారుల మండలి కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

108 మందికి మొక్కలు పంపిణీ


తణుకులో మొక్కలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

తణుకు: వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవంలో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొల్పిన విఘ్నేశ్వర స్వామి మండపంలో యువత వినూత్న కార్యక్రమం చేపట్టారు. గల్లీ బాయ్స్ కమిటీ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో తణుకు పట్టణంలోని 108 మంది వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. మట్టి వినాయకుణ్ని పూజించాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ వచ్చే ఏడాది నుంచి మట్టి విగ్రహాలనే పూజించే విధంగా ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆకుల వెంకటేష్, కొండేటి విజయకుమారి, సాపిరెడ్డి హరి, వంశీ, కర్రి ప్రసాద్‌రెడ్డి, ఆకుల రవి, పైబోయిన సత్యనారాయణ, తిరంశెట్టి రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉండి తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


గొల్లలకోడేరులో నరేంద్రరాజుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎంపీపీ చంటి రాజు, నాయకులు

పాలకోడేరు: ఉండిలో ఆదివారం నిర్వహించే ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఏఎంసీ వైస్ చైర్మన్‌గా గొల్లలకోడేరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చేకూరి రాజా నరేంద్రకుమార్, కోరుకొల్లుకు చెందిన గుండు నాగేశ్వరరావు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తొలుత మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గొల్లలకోడేరులో నరేంద్రకుమార్ నివాసానికి వెళ్లి ఆయనకు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేకూరి నరేంద్రరాజు, గుండు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు వరిస్తాయనడానికి తామే నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు కృతజ్ఞతలు తెలిపి పదవులకు న్యాయం చేస్తామన్నారు. రైతులకు సేవలు అందించడంలో తన వంతు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, సర్పంచుల చాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, కునాథరాజు కృష్ణంరాజు, దెందుకూరి వెంకటరాజు, బొక్కా రాంబాబు, గరగపర్రు అబ్బులు, పాలా రాధాకృష్ణ కడిమి కుమార్, చెల్లబోయిన పాపారావు, శివకోడు హనుమంతరావు, బ్యాంకు నరసింహరాజు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష


కాళింగగూడెం పుంతగట్టులో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం ఘంటా విజయలక్ష్మి


కాళింగగూడెంలో ఓ ఇంట వృద్ధుడు తంగి సత్యనారాయణకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆకివీడు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆదివారం మండలంలోని కాళింగగూడెంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 72 ఏళ్ల వృద్ధురాలు బొద్దుపల్లి నారాయణమ్మకు పరీక్షలు చేశారు. అన్నీ నార్మల్‌గా ఉండటంతో ఆమెకు బలానికి మందులు ఇచ్చారు. పాలినాటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ తంగి పుష్కరరావు తండ్రి 68 ఏళ్ల సత్యనారాయణకు వైద్య పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్, బీపీ, సుగర్ అన్నీ నార్మల్‌గా ఉండటంతో ఈయన కూడా బలానికి మందులు తీసుకున్నారు. గ్రామంలో ఆదివారం ఒక్కరోజే 68 గృహాలకు వెళ్లి 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఏఎన్‌ఎం ఘంటా విజయలక్ష్మీ చెప్పారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని పరీక్షలు చేశామని చెప్పారు. ఇద్దరు పక్షవాత రోగులకు మందులు అందుతున్న తీరును పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కరు ఎ.దమయంతి, వలంటీర్ ధనలక్ష్మీ సహకరించారని ఏఎన్‌ఎం చెప్పారు.